




DD9 వార్త
తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 237 హైదరాబాద్, ఏప్రిల్, ఆదివారం 19, 2026 పేజీలు : 06 వెల : 3.00


## మహిళా బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు: ఎమ్మెల్యే ధన్‌పాల్



05

# మేలో మరో పోరు!

**జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల దిశగా వేగం**
**ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఈసీ ఆదేశాలు**
**మే నెలలో ఎన్నికలు జరిగే అవకాశాలపై చర్చ**
**మండలాల వారీగా అదనపు ఓటర్ల గుర్తింపు ప్రక్రియ**
**పంచాయతీ, పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాలు**
**అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితా**
**గతంలో నిలిచిపోయిన ఎన్నికల ప్రక్రియకు కొత్త ఊపిరి**
**స్థానాల సంఖ్యలో మార్పులు, కొత్త పరిమాణాలు**
**అభ్యర్థుల్లో ఉత్సాహం, రాజకీయ చైతన్యం పెరుగుదల**




**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు మళ్లీ వేగం అందుకున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం తాజా ఆదేశాలతో జిల్లా యంత్రాంగం కదిలింది. ఓటర్ల జాబితా సిద్ధం చేయడంపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ కావడంతో ఎన్నికల ప్రక్రియకు తొలి అడుగు పడింది. కేంద్ర ఎన్నికల సంఘం నవీకరించిన ఓటర్ల జాబితాను ఆధారంగా తీసుకుని, కొత్తగా చేర్చిన ఓటర్ల వివరాలను సక్రమంగా గుర్తించి స్థానిక స్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఈ చర్యలతో ఎన్నికలు సమీపిస్తున్నాయన్న సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే వచ్చిన సమాచారం ప్రకారం పరిస్థితులు అనుకూలిస్తే మే నెలలోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో న్యాయపరమైన ఇబ్బందుల కారణంగా ..మిగతా 2లో

# దక్షిణాది రాష్ట్రాలకు కాంగ్రెస్ అన్యాయం

**బండి సంజయ్ తీవ్ర విమర్శలు**
**లోక్‌సభలో బిల్లు వీగిపోవడంపై ఆగ్రహం**
**దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరిగిందన్న ఆరోపణ**
**కాంగ్రెస్, ఇండి కూటమిపై తీవ్ర విమర్శలు**
**నియోజకవర్గాల పునర్విభజనపై ఆందోళనలు**
**కేంద్ర హామీలను విస్మరించారన్న ఆరోపణ**
**మహిళా ప్రాతినిధ్య అంశంపై వాదోపవాదాలు**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ పరిణామంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ..మిగతా 2లో

# నేనే శాంతి దూతను

**మరో సారి ట్రంప్ సంచలన ప్రకటన**
**ప్రపంచ యుద్ధాలు తానే ముగించానన్న ట్రంప్నా**
**నాటోపై తీవ్ర విమర్శలు**
**భారత్-పాక్ యుద్ధాన్ని నిలిపినట్టు ప్రకటన**
**ఇరాన్ యురేనియంపై వివాదాస్పద వ్యాఖ్యలు**
**ఇజ్రాయెల్-లెబనాన్ కాల్పుల విరమణపై స్పందన**
**ఇరాన్ నుంచి తీవ్ర ప్రతిస్పందన**
**హర్మూజ్ జలసంధి అంశంపై తాజా పరిణామాలు**
**నాటో కూటమిని 'పేపర్ టైగర్'గా విమర్శ**
**ప్రపంచ రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీసిన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

అమెరికా రాజకీయ వేదికపై మరోసారి సంచలన వ్యాఖ్యలతో డొనాల్డ్ ట్రంప్ చర్చనీయాంశంగా మారారు. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకున్న పలు ఘర్షణలను తానే పరిష్కరించానని పేర్కొంటూ తనను తాను శాంతి దూతగా అభివర్ణించారు. అమెరికాలో నిర్వహించిన టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, ..మిగతా 2లో




# హర్మూజ్‌పై ఇరాన్ కట్టుదిట్టం

**నౌకాయానానికి కఠిన నిబంధనలు**
**సముద్ర మార్గంపై ఇరాన్ పూర్తి నియంత్రణ**
**అనుమతి లేకుండా నౌకలకు ప్రవేశం నిరాకరణ**
**అమెరికా వ్యాఖ్యలపై ఘాలిబఫ్ తీవ్ర స్పందన**
**దౌత్య చర్చల మధ్య ఉద్రిక్తతలు కొనసాగింపు**
**నిర్దేశిత మార్గాల్లోనే వాణిజ్య నౌకాయానం**
**ఐఆర్‌జీసీ నౌకాదళం కొత్త మార్గదర్శకాలు**
**ప్రపంచ చమురు సరఫరాపై ప్రభావం**
**అమెరికా-ఇరాన్ చర్చలపై అంతర్జాతీయ ఆసక్తి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో హర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టు మరింత బలపరిచింది. ప్రపంచానికి కీలకమైన ఈ సముద్ర మార్గంలో ..మిగతా 2లో



# బయ్యారం గ్రీన్ స్టీల్ ప్లాంట్‌కు మళ్లీ ఊపిరి



**కేంద్రాన్ని కోరిన సీఎం రేవంత్ రెడ్డి**
**ఢిల్లీలో కేంద్ర ఉక్కు మంత్రులతో కీలక భేటీ**
**గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదన**
**తెలంగాణ రైజింగ్–2047 విజన్‌పై చర్చ**
**హైదరాబాద్‌ను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళిక**
**ఈవీ బ్యాటరీలు, హైడ్రోజన్ టెక్నాలజీపై దృష్టి**
**మెషిన్ టూల్స్, రోబోటిక్స్ పార్క్ ప్రతిపాదన**
**బయ్యారం స్టీల్ ప్లాంట్ ఆలస్యంపై విమర్శలు**
**ఐరన్ ఓర్ నిల్వలతో భారీ అవకాశాల అంచనా**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి కొత్త దిశగా అడుగులు వేస్తూ బయ్యారం గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అంశం మళ్లీ ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్. డి. కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో సమావేశమై ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లారు. పర్యావరణానికి అనుకూలంగా ..మిగతా 2లో

# డీలిమిటేషన్ పేరుతో కేంద్రం కుట్ర

**కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు**
**మహిళా బిల్లులో కేంద్రం ఉద్దేశాలపై అనుమానాలు**
**విపక్షాల ఐక్యతతో బిల్లు ఆగిందని వెల్లడి**
**దక్షిణాది ప్రయోజనాల పరిరక్షణపై దృష్టి**
**2023 బిల్లు యథాతథంగా అమలుకు డిమాండ్**
**మహిళా రిజర్వేషన్లలో సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం**
**ఉత్తర-దక్షిణ విభజన రాజకీయాలపై విమర్శ**
**నిరసనలకు సిద్ధమని హెచ్చరిక**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

మహిళా రిజర్వేషన్ బిల్లుపై దేశవ్యాప్తంగా కొనసాగుతున్న రాజకీయ చర్చల మధ్య తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న పేరుతో తీసుకువచ్చిన బిల్లు ..మిగతా 2లో

# హాట్ సమ్మర్‌లో చిల్డ్ బీర్లతో చిల్..

## రికార్డుస్థాయిలో బీర్ల సేల్స్..

**ఎండల కారణంగా భారీగా పెరిగిన బీర్ వినియోగం**
**కేసులకు కేసులు అమ్ముడుపోతున్న బీర్లు**
**కోట్ల లీటర్ల బీరు మార్కెట్లోకి వస్తోంది**
**మ్యాచ్‌లు చూస్తూ బీర్ తాగే ట్రెండ్ పెరుగుతోంది**
**బీర్ సేల్స్ పెరుగడంతో అబ్కారీ శాఖకు భారీ ఆదాయం**
**భవిష్యత్తులో రికార్డు స్థాయి అమ్మకాల అంచనా**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఎండలు మండిపోతున్నాయి. ఉదయం ఎనిమిది గంటలకే నడి నెత్తిన సూర్యారావ్ మంటెక్కించేస్తున్నాడు. ఎక్కడ చూసినా నలభై మూడు డిగ్రీలకు పైగానే టెంపరేచర్లు నమోదవుతున్నాయి. ప్రతిసారి ఏప్రిల్, మే నెలల్లో ఎండల భగ్గుమంటే, ఈసారి మార్చి నుంచే భానుడు నిప్పులు కురిపించడం మొదలెట్టాడు. జనాలు చల్లటి పానీయాల వైపు మొగ్గుచూపుతున్నారు. మందుబాబులు మాత్రం కూల్‌గా బీర్లు తాగేస్తున్నారు. మలమలమాడే ఎండకు చిల్డ్ బేరేసి ..మిగతా 2లో



# దక్షిణాది రాష్ట్రాలకు కాంగ్రెస్ అన్యాయం

మొదటిపేజీ తరువాయి



బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. విపక్షాల వైఖరిని తీవ్రంగా విమర్శిస్తూ, దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. ముఖ్యంగా కాంగ్రెస్, ఇండి కూటమి దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేశాయని ఆయన వ్యాఖ్యానించారు.

పార్లమెంట్‌లో దక్షిణాది ప్రయోజనాలను కాపాడే కీలక బిల్లును అడ్డుకోవడం చారిత్రక తప్పిదమని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. వెలుపల దక్షిణాది గౌరవం గురించి మాట్లాడే విపక్షాలు, లోక్‌సభలో మాత్రం ఆ ప్రాంతానికి మేలు చేసే చట్టాన్ని అడ్డుకోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. ఈ చర్య ద్వారా ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశారని విమర్శించారు.2026 తర్వాత జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన కీలక అంశంగా మారింది. జనాభా ఆధారంగా సీట్ల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలు రాజకీయంగా వెనుకబడే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు అభివృద్ధి, విద్యపై దృష్టి పెట్టి ముందుకు సాగుతున్నప్పటికీ, సీట్ల తగ్గింపుతో వాటి ప్రాధాన్యం తగ్గే అవకాశం ఉందని అన్నారు.

ఈ సమస్యకు పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వం 131వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకువచ్చిందని ఆయన వివరించారు. ఈ బిల్లు దక్షిణాది రాష్ట్రాలకు రక్షణ కవచంలా పని చేసేదని, ప్రాతినిధ్య సమతుల్యతను కాపాడేదని తెలిపారు. అయితే విపక్షాలు రాజకీయ లాభాల కోసం ఈ బిల్లును అడ్డుకోవడం బాధాకరమని అన్నారు.కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇచ్చిన హామీలను కూడా బండి సంజయ్ ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల సీట్లను పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం ప్రకటించినప్పటికీ విపక్షాలు స్పందించలేదని విమర్శించారు. ఈ హామీ ద్వారా ప్రాంతీయ సమతుల్యతను కాపాడాలని కేంద్రం ప్రయత్నించినట్లు తెలిపారు.

మహిళా ప్రాతినిధ్య అంశం కూడా ఈ బిల్లులో కీలక భాగమని ఆయన పేర్కొన్నారు. మహిళలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించేందుకు ఈ సంస్కరణ ఉపయోగపడేదని చెప్పారు. భవిష్యత్ తరాలకు సమాన అవకాశాలు కల్పించే దిశగా ఈ బిల్లు ఒక ముఖ్యమైన అడుగుగా ఉండేదని అభిప్రాయపడ్డారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం కృషి చేస్తోందని బండి సంజయ్ అన్నారు. అయితే విపక్షాలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కీలక సంస్కరణలను అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ఈ వైఖరి ప్రజాస్వామ్యానికి హానికరమని అభిప్రాయపడ్డారు.

ఈ పరిణామాలపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడం భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఈ అంశం ఎన్నికల రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.ఈ వివాదం కేంద్రవిపక్షాల మధ్య రాజకీయ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేసింది. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం, మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలు భవిష్యత్‌లో మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. ప్రజలు ఈ పరిణామాలను ఎలా స్వీకరిస్తారన్నది రాబోయే ఎన్నికల్లో స్పష్టమయ్యే అవకాశముంది.

# డీలిమిటేషన్ పేరుతో కేంద్రం కుట్ర

మొదటిపేజీ తరువాయి



వెనుక నిజాయితీ లేదని ఆరోపించారు. బిల్లును మూడు వేర్వేరు ప్రతిపాదనల రూపంలో తీసుకువచ్చి, అసలు ఉద్దేశం డీలిమిటేషన్ అమలు చేయడమేనని పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా రాజ్యాంగ నిర్మాణంలో మార్పులు తీసుకురావాలన్న ప్రయత్నం జరిగిందని వ్యాఖ్యానించారు.దిల్లీలో మీడియాతో మాట్లాడిన సీఎం, విపక్షాల ఐక్యత వల్లే ఈ బిల్లు ముందుకు సాగలేదని తెలిపారు. ఇది సాధారణ రాజకీయ ఓటమి కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలపై వచ్చిన ప్రతిఘటన అని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ వేదికగా ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నామని స్పష్టం చేశారు.

మహిళా రిజర్వేషన్లపై ఇప్పటికే చట్టపరమైన వ్యవస్థ ఉన్నదని సీఎం వివరించారు. చిన్న సవరణలతోనే రిజర్వేషన్లు అమలు చేయవచ్చని అభిప్రాయపడ్డారు. కానీ కొత్త బిల్లుల ద్వారా అవసరంలేని మార్పులు తీసుకురావాలని ప్రయత్నించడం వెనుక వేరే ఉద్దేశాలు ఉన్నాయని అన్నారు. రిజర్వేషన్ల వ్యవస్థను బలహీనపరచాలన్న ప్రయత్నమే జరుగుతోందని విమర్శించారు.కేంద్రంపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, భారీ మెజారిటీ వస్తే రాజ్యాంగ మార్పులకు పాల్పడే అవకాశముందని సీఎం హెచ్చరించారు. ఈ నేపథ్యంలో విపక్షాలు అప్రమత్తంగా వ్యవహరించాయని పేర్కొన్నారు. ప్రతిపక్షాలపై తప్పుదోవ పట్టించే ప్రచారం జరుగుతోందని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉందని అన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును యథాతథంగా అమలు చేయాలని సీఎం డిమాండ్ చేశారు. 2023లో ప్రవేశపెట్టిన బిల్లును ఎలాంటి మార్పులు లేకుండా అమలు చేస్తే పూర్తి మద్దతు ఇస్తామని తెలిపారు. మహిళలకు ప్రాతినిధ్యం పెరగడం సమాజ అభివృద్ధికి కీలకమని చెప్పారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు కూడా తగిన ప్రాధాన్యం కల్పించాలని సూచించారు.ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య విభజన సృష్టించే రాజకీయాలు ఆగాలని సీఎం అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధి సమతుల్యంగా ఉండాలంటే అన్ని ప్రాంతాలకు సమాన అవకాశాలు అవసరమని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా కేంద్రానికి కీలకంగా సహకరిస్తున్నాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటం ముఖ్యమని అన్నారు.

మహిళా రిజర్వేషన్లపై తమకు పూర్తి నిబద్ధత ఉందని సీఎం స్పష్టం చేశారు. త్వరలో జరగబోయే ఎన్నికల ముందు ఈ బిల్లును అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో అప్పుడు స్పష్టమవుతుందని సవాల్ విసిరారు. మహిళా సాధికారతకు అడ్డంకులు సృష్టించే చర్యలను సహించబోమని హెచ్చరించారు. రాజకీయ అవసరాల కోసం మహిళా రిజర్వేషన్ అంశాన్ని ఉపయోగించకూడదని సీఎం అన్నారు. ఈ విషయం దేశ ప్రయోజనాలకు సంబంధించినదని, అందరూ కలసి ముందుకు సాగాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ గతంలో మహిళల కోసం తీసుకున్న నిర్ణయాలను ప్రస్తావిస్తూ, తమ కట్టుబాటును వివరించారు.

లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందకపోవడంపై స్పందిస్తూ, కేంద్ర ప్రభుత్వ వైఖరిపై విమర్శలు కొనసాగించారు. తప్పుడు విధానాలు కొనసాగితే గల్లీ నుంచి పార్లమెంట్ వరకు నిరసనలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రవిపక్షాల మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఒకవైపు మహిళా సాధికారత అంశం, మరోవైపు రాజకీయ వ్యూహాలు కలిసి ఈ అంశాన్ని ప్రధాన చర్చగా నిలిపాయి. రాబోయే రోజుల్లో ఈ విషయంపై మరింత రాజకీయ పోరు కొనసాగనున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

# మేలో మరో పోరు!

మొదటిపేజీ తరువాయి

నిలిచిపోయిన ప్రక్రియను ఈసారి పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని దశలను వేగంగా పూర్తి చేయాలని అధికార యంత్రాంగానికి సూచనలు అందాయి.

కేంద్ర ఎన్నికల సంఘం 2025 జూలై 10 నుంచి 2026 ఫిబ్రవరి 5 వరకు నవీకరించిన ఓటర్ల జాబితాలోని మార్పులను రాష్ట్ర ఎన్నికల సంఘం పరిశీలించింది. అందులో నియోజకవర్గాల వారీగా పెరిగిన ఓటర్ల వివరాలను మండలాల ప్రకారం విభజించి గుర్తించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చింది. హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలను మినహాయించి మిగిలిన అన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేసింది .ఈ వివరాల ఆధారంగా గ్రామ పంచాయతీలు, పోలింగ్ కేంద్రాల వారీగా కొత్త ఓటర్ల జాబితాలను రూపొందించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి జిల్లా పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో పని జరగాలి. తయారైన జాబితాలను సంబంధిత అధికారుల ధ్రువీకరణ అనంతరం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాలతో అనుసంధానం చేయాలి. సాంకేతికంగా ఏవైనా లోపాలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి సరిదిద్దాలని స్పష్టం చేశారు.

ఓటర్ల జాబితాలో తేడాలు ఉన్నట్లయితే వాటిని ఈ నెల 23లోపు ఎన్నికల సంఘానికి నివేదించాల్సి ఉంటుంది. అందిన సమాచారం ఆధారంగా పరిశీలన చేసి ముసాయిదా జాబితాలను విడుదల చేయనున్నారు. ఈ ముసాయిదా జాబితాలపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి తుది జాబితాను రూపొందిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది నియామకం వంటి తదుపరి చర్యలు చేపడతారు.గతంలోనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ కొన్ని కారణాల వల్ల అది నిలిచిపోయింది. 2019 మే నెలలో చివరిసారిగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత ఫలితాలు ప్రకటించి స్థానిక సంస్థల ప్రతినిధులను ఎన్నుకున్నారు. వారి పదవీకాలం గత ఏడాది జూన్‌తో ముగియడంతో అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పాలన కొనసాగుతోంది.

ఎన్నికల నిర్వహణకు గత ఏడాది సెప్టెంబర్ 29న నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్ల స్వీకరణ ప్రారంభించారు. అయితే రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో అక్టోబర్ 9న ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను నిలిపివేశారు. తర్వాత న్యాయస్థానం అనుమతితో గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు రిజర్వేషన్ల విధానం స్పష్టతకు రావడంతో మిగిలిన స్థానిక సంస్థల ఎన్నికలను కూడా పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల వివరాలను సిద్ధం చేసి ఎన్నికల సంఘానికి అందజేసింది. తాజా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 566 జడ్పీటీసీ స్థానాలు, 5,773 ఎంపీటీసీ స్థానాలు ఖరారయ్యాయి. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాను అర్బన్ జిల్లాగా పరిగణించడం వల్ల




జిల్లా పరిషత్‌ల జాబితాలో మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 31 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి.

గతంలో జరిగిన పరిపాలనా మార్పుల కారణంగా కొన్ని గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలు, నగరపాలికల్లో విలీనమయ్యాయి. దీనివల్ల గ్రామాల సంఖ్య తగ్గింది. ఫలితంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల సంఖ్యలో కూడా తగ్గుదల కనిపించింది. మొత్తం 44 ఎంపీటీసీ, నాలుగు జడ్పీటీసీ, నాలుగు ఎంపీపీ స్థానాలు తగ్గినట్లు అధికారులు పేర్కొన్నారు.ఎన్నికలు సమీపిస్తున్నాయన్న సంకేతాలతో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. స్థానిక స్థాయిలో నాయకత్వం సాధించాలని ఆశించే అభ్యర్థులు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించారు. గ్రామ స్థాయిలో బలమైన మద్దతు కూడగట్టుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఇప్పటికే సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో ఇప్పుడు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు కీలకంగా మారాయి.

ఈ ఎన్నికలు స్థానిక పాలనలో కీలక పాత్ర పోషించే సంస్థలకు సంబంధించినవిగా ఉండటంతో రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఈ సంస్థల పాత్ర కీలకం. అందుకే ఈసారి పోటీ తీవ్రంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు రాజకీయ చర్చలు మరింత ఉధృతమయ్యే అవకాశాలు ఉన్నాయి.ఎన్నికల సంఘం తీసుకున్న తాజా నిర్ణయాలు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు మార్గం సుగమం చేస్తున్నాయి. ఓటర్ల జాబితా సిద్ధం నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ త్వరలోనే పూర్తి స్థాయిలో ఎన్నికల నిర్వహణ దశకు చేరుకునే అవకాశముంది. రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చైతన్యం మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# బయ్యారం గ్రీన్ స్టీల్ ప్లాంట్‌కు మళ్లీ ఊపిరి

మొదటిపేజీ తరువాయి

ఉండే గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా ఉక్కు కొరత తగ్గడంతో పాటు స్థిరమైన పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన వివరించారు.

ఈ సమావేశంలో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను కేంద్రానికి వివరించారు. ముఖ్యంగా ఆధునిక సాంకేతికత ఆధారంగా పరిశ్రమలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పాత వాహనాల స్క్రాప్‌ను ఉపయోగించి ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ విధానం ద్వారా వనరుల వినియోగం మెరుగుపడటంతో పాటు కాలుష్యాన్ని కూడా తగ్గించవచ్చని పేర్కొన్నారు.హైదరాబాద్‌ను దేశ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. హైడ్రోజన్ టెక్నాలజీ ఆధారంగా గ్రీన్ స్టీల్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఆటోమొబైల్, రక్షణ రంగాలకు అవసరమైన కీలక ఉత్పత్తుల తయారీకి అనుకూల వాతావరణం రాష్ట్రంలో ఉందని వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు అవసరమని పేర్కొన్నారు.

ఇదే సమయంలో మెషిన్ టూల్స్, రోబోటిక్స్ రంగాల్లో ప్రత్యేక పార్క్ ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఆధునిక పరిశ్రమల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను స్థానిక యువతకు అందించేందుకు జాతీయ స్థాయి సంస్థలు అవసరమని తెలిపారు. దీని ద్వారా ఉద్యోగ అవకాశాలు విస్తరించే అవకాశం ఉందని చెప్పారు.హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2034 నాటికి వాహనాలన్నీ ఎలక్ట్రిక్ వాహనాలుగా మారేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ దిశగా కేంద్ర సహకారం కీలకమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధి సాధ్యమయ్యేలా సమగ్ర ప్రణాళిక అవసరమని తెలిపారు.

ఇక బయ్యారం స్టీల్ ప్లాంట్ అంశం గత కొన్నేళ్లుగా చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర విభజన అనంతరం ఈ ప్రాజెక్టు అమలు కాలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ బయ్యారం ప్రాజెక్టుపై నిర్లక్ష్యం చూపుతున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించడం ప్రాధాన్యం సంతరించుకుంది.బయ్యారం ప్రాంతంలో విస్తారమైన ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నట్లు గతంలోనే గుర్తించారు. సుమారు 1.41 లక్షల ఎకరాల్లో ఇనుము ఖనిజం లభ్యమవుతుందని అంచనా. ఈ వనరులను వినియోగించి స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే తక్కువ వ్యయంతో ఉత్పత్తి సాధ్యమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా స్థానికంగా వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చని భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశం చేర్చినా అమలులో ఆలస్యం జరగడం రాజకీయ చర్చకు దారితీసింది. దాదాపు పదేళ్లకు పైగా గడిచినా ప్రాజెక్టు ముందుకు సాగకపోవడంపై అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రాన్ని విమర్శిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తాజా భేటీతో ఈ ప్రాజెక్టుకు మళ్లీ ఊపిరి వస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి బయ్యారం గ్రీన్ స్టీల్ ప్లాంట్ కీలకంగా మారే అవకాశం ఉంది. పర్యావరణానికి అనుకూలమైన సాంకేతికతతో ఈ ప్రాజెక్టు అమలు అయితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించే అవకాశం ఉంది. కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తే ఈ ప్రాజెక్టు త్వరలోనే కార్యరూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# నేనే శాంతి దూతను

మొదటిపేజీ తరువాయి

అంతర్జాతీయ రాజకీయాలపై తన పాత్రను విశేషంగా వివరించారు. ముఖ్యంగా భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగి యుద్ధంగా మారే పరిస్థితిని తానే నివారించానని పేర్కొనడం విశేషంగా నిలిచింది.

భారత్‌పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగి ఉంటే కోట్లాది ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఆ పరిస్థితిని తాను చర్చల ద్వారా సద్దుమణిగేలా చేశానని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది ప్రధాన యుద్ధాలను ముగించానని, ఇరాన్, లెబనాన్ పరిణామాలను కలుపుకుంటే మొత్తం పది ఘర్షణలను తానే నిలిపివేశానని వెల్లడించారు. ఈ చర్యల వల్ల లక్షలాది ప్రాణాలు కాపాడినట్టు ఆయన పేర్కొన్నారు.మధ్యప్రాచ్య పరిణామాలపై కూడా ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇజ్రాయెల్‌లెబనాన్ మధ్య ఎన్నో దశాబ్దాల తర్వాత కాల్పుల విరమణ సాధ్యమైందని, ఇది చారిత్రాత్మక ఒప్పందంగా నిలిచిందని ఆయన తెలిపారు. ఈ ఒప్పందంతో ఆ ప్రాంతంలో స్థిరత్వం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లెబనాన్ పరిస్థితిని నియంత్రణలోకి తీసుకురావడంలో అమెరికా పాత్ర కీలకమని పేర్కొన్నారు.

ఇరాన్ అంశంపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మరింత వివాదాస్పదంగా మారాయి. ఇరాన్‌తో కలిసి యురేనియంను తవ్వి అమెరికాకు తరలిస్తామని ఆయన ప్రకటించారు. పెద్ద యంత్రాల సహాయంతో ఈ ప్రక్రియను నిర్వహిస్తామని చెప్పడం అంతర్జాతీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ దేశంలో ఉన్న యురేనియం తమకు అత్యంత విలువైనదని, దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర దేశాలకు తరలించబోమని ఇరాన్ విదేశాంగ ప్రతినిధులు స్పష్టం చేశారు. అమెరికా చేస్తున్న ప్రకటనలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని విమర్శించారు.హర్మూజ్ జలసంధి పరిణామాలపై కూడా ట్రంప్ స్పందించారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయని, వాణిజ్య నౌకాయానానికి మళ్లీ అనుమతులు లభిస్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ పూర్తి స్థాయి ఒప్పందం కుదిరే వరకు అమెరికా నౌకాదళం విధించిన నియంత్రణలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రపంచ చమురు, సహజ వాయువు సరఫరాలో కీలకమైన ఈ మార్గం తిరిగి సాధారణ స్థితికి రావడం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు ఉపశమనంగా మారే అవకాశం ఉందని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

నాటో కూటమిపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కూడా తీవ్ర చర్చకు దారితీశాయి. అవసరమైన సమయంలో సహాయం అందించలేదని ఆరోపిస్తూ నాటోను 'పేపర్ టైగర్'గా అభివర్ణించారు. రెండు నెలల క్రితం సహాయం అవసరమైనప్పుడు స్పందించని కూటమి ఇప్పుడు పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత సహాయం అందిస్తామని చెప్పడం అర్థరహితమని విమర్శించారు. ఈ వ్యాఖ్యలు పాశ్చాత్య దేశాల మధ్య సంబంధాలపై ప్రభావం చూపే అవకాశముంది.అమెరికా సైనిక శక్తిపై ట్రంప్ మరోసారి దృష్టిసారించారు. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన సైన్యం, నౌకాదళం తమదేనని పేర్కొన్నారు. హర్మూజ్ ప్రాంతంలో భద్రతా పరిస్థితులను నియంత్రించడంలో అమెరికా కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలోనే పూర్తి స్థాయి ఒప్పందం కుదిరే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇక ఇరాన్ వర్గాలు కూడా తమ వైఖరిని స్పష్టం చేశాయి. హర్మూజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకాయానానికి అనుమతులు ఉన్నాయని ప్రకటించాయి. అంతర్జాతీయ వాణిజ్యానికి ఎటువంటి అడ్డంకులు ఉండవని పేర్కొన్నాయి. అయితే అమెరికా విధించిన నియంత్రణలు కొనసాగుతుండటం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చే అవకాశముంది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రపంచ రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీశాయి. తాను శాంతి దూతగా వ్యవహరించానన్న ఆయన ప్రకటనలు, ఇతర దేశాలపై చేసిన విమర్శలు అంతర్జాతీయ సంబంధాలపై ప్రభావం చూపే అవకాశముంది. ముఖ్యంగా నాటోపై చేసిన వ్యాఖ్యలు, ఇరాన్‌పై చేసిన ప్రకటనలు భవిష్యత్తులో మరిన్ని పరిణామాలకు కారణమయ్యే అవకాశం కనిపిస్తోంది. ప్రపంచ దేశాలు ఈ వ్యాఖ్యలను ఎలా స్వీకరిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.



# హర్మూజ్‌పై ఇరాన్ కట్టుదిట్టం

మొదటిపేజీ తరువాయి

ఇకపై నౌకాయానం పూర్తిగా తమ నియంత్రణలోనే కొనసాగుతుందని ఆ దేశ నాయకత్వం స్పష్టం చేసింది. ఈ మార్గంలో ప్రయాణించాలంటే ఇరాన్ అనుమతి తప్పనిసరి అని ప్రకటించడంతో అంతర్జాతీయ వాణిజ్య రంగంలో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా చమురు రవాణాలో కీలకమైన ఈ మార్గంపై కట్టుదిట్టమైన నియంత్రణలు విధించడం గ్లోబల్ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశముంది.ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ ఈ అంశంపై స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధి పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందని, అవసరమైతే దానిని మూసివేయడానికి కూడా వెనుకాడబోమని తెలిపారు. అమెరికా చేస్తున్న ప్రకటనలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని విమర్శిస్తూ, తమ నౌకా రాకపోకలను అడ్డుకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దౌత్య చర్చలు జరుగుతున్న సమయంలో ఈ తరహా వ్యాఖ్యలు పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు.

ఇరాన్ విదేశాంగ వర్గాలు కూడా ఇదే దృక్పథాన్ని వ్యక్తం చేశాయి. హర్మూజ్ జలసంధి వినియోగంపై స్పష్టమైన విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నాయి. నౌకలు కేవలం నిర్దేశించిన మార్గాల్లోనే ప్రయాణించాల్సి ఉంటుందని, ప్రతి నౌకకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెలిపారు. అవసరమైతే ఈ మార్గాన్ని మూసివేయడానికీ సిద్ధంగా ఉన్నామని పునరుద్ఘాటించారు. ఈ ప్రకటనలు అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన ఈ మార్గంపై అనిశ్చితిని పెంచుతున్నాయి.

ఇదే సమయంలో ఇరాన్ విదేశాంగ మంత్రి హర్మూజ్ జలసంధిని తాత్కాలికంగా తెరవనున్నట్లు ప్రకటించారు. లెబనాన్ ప్రాంతంలో కాల్పుల విరమణ అమలులోకి రావడంతో వాణిజ్య నౌకాయానానికి అనుమతి ఇస్తున్నట్లు వెల్లడించారు. అయితే ఈ అనుమతి పూర్తిగా షరతులతో కూడినదేనని స్పష్టం చేశారు. నౌకలు నిర్ణయించిన మార్గాల్లోనే ప్రయాణించాలి, అధికారుల అనుమతి తీసుకోవాలి అనే నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఇజ్రాయెల్‌లెబనాన్ మధ్య ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఈ పరిణామాలకు పరోక్ష కారణంగా భావిస్తున్నారు. ఈ ఒప్పందం వల్ల ప్రాంతంలో కొంతమేర ఉద్రిక్తత తగ్గినప్పటికీ, పూర్తి స్థాయి స్థిరత్వం ఇంకా నెలకొనలేదని విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే ఇరాన్ జాగ్రత్త చర్యల భాగంగా హర్మూజ్ జలసంధిపై నియంత్రణ కొనసాగిస్తోంది.

మరోవైపు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నౌకాదళం కూడా కొత్త మార్గదర్శకాలను ప్రకటించింది. అన్ని వాణిజ్య నౌకలు తమ అనుమతితోనే ప్రయాణించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ముఖ్యంగా సివిలియన్ నౌకలు నిర్దేశిత మార్గాల్లోనే కదలాలని పేర్కొంది. సైనిక నౌకలకు అనుమతి ఉండదని చెప్పడం ఈ ప్రాంతంలో భద్రతా పరిస్థితులను మరింత కఠినతరం చేస్తోంది. హర్మూజ్ జలసంధి ప్రపంచ చమురు సరఫరాలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో సుమారు 20 శాతం ఈ మార్గం ద్వారానే రవాణా అవుతుంది. అందువల్ల ఈ ప్రాంతంలో ఏ చిన్న మార్పు జరిగినా అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం తప్పదు. ఇరాన్ విధించిన పరిమితులు, హెచ్చరికలు చమురు ధరల్లో అస్థిరతకు దారితీసే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఇదిలా ఉండగా అమెరికాఇరాన్ మధ్య దౌత్య చర్చలు కొనసాగుతున్నాయి. త్వరలోనే రెండో విడత చర్చలు జరగనున్నట్లు సమాచారం. ఈ చర్చలు పాకిస్థాన్ వేదికగా జరిగే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. అణు కార్యక్రమం, ఆర్థిక ఆంక్షలు, భద్రతా అంశాలు ప్రధాన చర్చా విషయాలుగా ఉండే అవకాశం ఉంది. ఇరాన్ తన ఆర్థిక ఆస్తులపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని కోరుకుంటోంది.హర్మూజ్ జలసంధి అంశం అంతర్జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారింది. ఒకవైపు దౌత్య చర్చలు కొనసాగుతుండగా మరోవైపు పరస్పర ఆరోపణలు, హెచ్చరికలు పరిస్థితిని క్లిష్టతరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే చర్చలు ఏ దిశగా మలుపుతిప్పుతాయన్నది ప్రపంచవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. ఈ సమస్య పరిష్కారం అంతర్జాతీయ వాణిజ్యం, భద్రతా పరిస్థితులపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశముంది.



# తెలంగాణ మోటార్ రివైండింగ్ ఎలక్ట్రికల్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**బీర్కూర్, ఏప్రిల్ 18 (డిడి9 వార్త):**

బీర్కూర్ మండలంలో తెలంగాణ మోటార్ రివైండింగ్ ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యులు సేవా కార్యక్రమంలో భాగంగా ముందుకు వచ్చారు. కామారెడ్డి జిల్లా అధ్యక్షులు షేక్ ముఖ్యం, రాష్ట్ర సమన్వయకర్త షబ్బీర్ బాయ్, మండల అధ్యక్షులు మైముద్, ఉపాధ్యక్షులు జి గంగాధర్, రబ్బానీ తదితర సభ్యులు కలిసి ఎండి ఆసిఫ్‌కు రూ.12,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అవసరమైన సమయంలో పరస్పరం తోడ్పాటు అందించుకోవడం యూనియన్ ముఖ్య లక్ష్యమని తెలిపారు. సభ్యుల ఐక్యతతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు.



# నిజామాబాద్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 18 (డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లాకు సంబంధించి జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ రెండేళ్ల కాలపరిమితితో అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో మొత్తం పదిమందిని సభ్యులుగా నియమించారు. జి.సాయి ప్రసాద్, బాల కుమార్, నర్సింహులు, భూపతి, రామదయానంద్, మహ్మద్ గౌస్, శ్రీనివాస్, శ్రీకాంత్, మాజిద్, జాన్సన్‌లను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో మీడియా ప్రతినిధులకు గుర్తింపు కార్డులు, ఇతర సౌకర్యాల పరంగా ఈ కమిటీ కీలక పాత్ర పోషించనుంది.

# హాట్ సమ్మర్‌లో చిల్డ్ బీర్లతో చిల్..

మొదటిపేజీ తరువాయి

చిల్లవుతున్నారు. దాంతో బీర్ల అమ్మకాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కేసులకు కేసులు రాగించేస్తుండటంతో... కోట్ల లీటర్ల బీరు మార్కెట్లోకి ఏరులై పారుతోంది. ఒక్క హైదరాబాద్ పరిధిలోనే రోజుకు వేలాది కేసుల బీర్లు అమ్ముడవుతున్నాయి. వాతావరణానికి తోడు ఐపీఎల్ కూడా తోడుకావడంతో మ్యాచ్ చూస్తూ పీపాలకు పీపాలు లేపేస్తున్నారు. మద్యానికి బదులు బీర్లు తాగేవారు ఎక్కువయ్యారు. బీర్ డిమాండ్ వీకెండ్స్ కు రెట్టింపైంది. మున్ముందు బీర్ సేల్స్ రికార్డు స్థాయికి చేరుతాయంటున్నారు. బీర్ల సేల్స్ పెరిగేకొద్దీ అబ్కారీ శాఖ ఖజానా కళకళలాడుతోంది.

దేశవ్యాప్తంగా 2026 మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండలు తీవ్రంగా ఉండటంతో బీర్ అమ్మకాలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో, అందునా తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయి అమ్మకాలు నమోదయ్యాయి. తెలంగాణలో ఈ మార్చిలో ఏకంగా 50 లక్షల కేసులకి పైగా బీర్ అమ్మడైంది. ఇది గత ఏడాది అమ్మకాలతో పోలిస్తే 22 శాతం ఎక్కువ. ఏప్రిల్ మొదటి 13 రోజుల్లోనే దాదాపు 21 లక్షల కేసులు అమ్ముడయ్యాయి. ప్రస్తుతం ప్రతిరోజూ సగటున 1.7 లక్షల నుంచి 1.8 లక్షల కేసుల సేల్స్ జరుగుతున్నాయి. సాధారణ రోజుల్లో రోజుకు 1.50 లక్షల కేసులు అమ్ముడైతే, ఇప్పుడు అది 2 లక్షలకు చేరింది. ఎండలు పెరిగే కొద్దీ ఇది 2.5 లక్షలకు చేరవచ్చని అంచనా. హైదరాబాద్ వంటి నగరాల్లో ప్రీమియం,ఫారిన్ బ్రాండ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. సాధారణంగా ఏడాదికి 450500 లక్షల కేసులు అమ్ముడవుతుంటాయి, కానీ ఈ ఏడాది అది 600 లక్షల కేసులను దాటుతుందని అంచనా వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఇతర మెట్రో నగరాలైన ముంబై, బెంగళూరు, ఢిల్లీలలో కూడా బీర్ అమ్మకాలు సుమారు 15శాతం నుండి 20శాతం వరకు వృద్ధిని కనబరుస్తున్నాయి. యువతలో క్రాఫ్ట్ బీర్లు, తక్కువ ఆల్కహాల్ ఉండే బీర్ల పట్ల ఆసక్తి పెరగడం కూడా ఈ వృద్ధికి ఒక కారణంగా కనిపిస్తోంది. అయితే, కొన్ని ప్రాంతాల్లో ఉత్పత్తికి అవసరమైన నీటి కొరత, ముడి పదార్థాల ధరల పెరుగుదల వల్ల సరఫరాపై కొంత ఒత్తిడి కూడా ఉంది. బార్‌లు, రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు బీర్ స్టాక్‌ను సిద్ధంగా ఉంచుకుంటున్నాయి. ఇప్పుడు అన్ని రకాల ప్రీమియం బ్రాండ్లు అందుబాట్లో వుండడంతో ఈ సమ్మర్ హీట్ చిల్ అవుతుందంటున్నారు వ్యాపారులు. స్టాక్ త్వరగా ఖాళీ అవుతుండటంతో డీలర్లు అడిషనల్ కార్టన్ల కోసం డిపోల చుట్టూ తిరుగుతున్నారు. మామూలుగా వారానికి ఒక్కసారి స్టాక్ తెప్పించుకునేవాళ్లు. కానీ ఇప్పుడు నాలుగు రోజులకు ఒకసారి తెప్పించాల్సిన పరిస్థితి. ఆ స్థాయిలో సేల్స్ పెరిగాయి. ఈవెంట్లు, పార్టీలకు వేసవి కాలం అనుకూలంగా మారడంతో వీకెండ్స్‌లో బీర్ డిమాండ్ మరింత పెరుగుతోందని ట్రేడర్లు చెబుతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోనూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పాటు బీర్ల అమ్మకాలు పెరుగుతున్నాయి. గత నెల నుంచే బీరు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే బీరు విక్రయాలు 30 శాతం మేరకు పెరిగాయి. వచ్చే రెండు మాసాల్లో ఎండలు మరింత పెరగనుండటతో సేల్స్ కూడా భారీగా పెరుగుతాయని అంచనా వేస్తున్నాయి ఎక్సైజ్ వర్గాలు. ఏపీలో మార్చి నెలలో 29.8 శాతం మేరకు అధికంగా బీర్లు అమ్ముడైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి వినియోగదారులు లిక్కర్ కంటే బీర్లకే మొగ్గుచూపుతున్నారు మందుబాబులు. గతేడాది ఏప్రిల్‌లో 12 వరకు 11.78 లక్షల కేసుల మద్యం అమ్మగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇప్పటి వరకు 8.52 లక్షల కేసుల మద్యమే అమ్ముడైంది. మార్చిలో సుమారు 26.11 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. గతేడాది మార్చిలో కేవలం 20 లక్షల కేసులు మాత్రమే. అంటే దాదాపు 30% వృద్ధి నమోదైంది. ఏప్రిల్ మొదటి 12 రోజుల్లోనే 9.2 లక్షల కేసుల బీర్లు సేల్ అయ్యాయి. గతేడాది ఇదే సమయానికి 8.16 లక్షల కేసులు మాత్రమే అమ్ముడయ్యాయి. తెలంగాణతో పోలిస్తే ఏపీలో బీర్ల వినియోగం తక్కువగా ఉన్నప్పటికీ, ఈ ఏడాది వృద్ధి రేటు ఏపీలోనే ఎక్కువగా వుంది. ఎండల తీవ్రత పెరగడం వల్ల ప్రజలు లిక్కర్ నుంచి బీర్లకు షిఫ్ట్ అవ్వడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా 28.4 శాతం వృద్ధి సాధించింది. శ్రీసత్యసాయిలో 27.75 శాతం, కర్నూలులో 26.03 శాతం అమ్మకాలు పెరిగాయి.




బీర్ సేల్స్ పెరగడంతో లిక్కర్ వినియోగం మాత్రం గణనీయంగా తగ్గిపోయింది. గత ఏడాది ఏప్రిల్‌లో 11.78 లక్షల కేసుల మద్యం అమ్ముడైతే... ఈ ఏడాది ఏప్రిల్‌లో అది కేవలం 8.52 లక్షల కేసులకు పడిపోయింది. అంటే లిక్కర్ అమ్మకాలు 27.64 శాతం తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి. సాధారణంగా ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి బీర్ డిమాండ్ పెరుగుతుంది. కానీ ఈసారి మాత్రం ట్రెండ్ ముందుగానే మారింది. మార్చి నుంచే బీర్ మార్కెట్ పీక్‌లోకి వెళ్లింది.ఇప్పటివరకు తెలంగాణతో పోలిస్తే ఏపీలో వినియోగదారులు ఎక్కువగా హార్డ్ లిక్కర్‌కే మొగ్గు చూపేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ఎండలు పెరిగిన వెంటనే బీర్ కొనుగోలు చేసే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది.ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలను దాటేశాయి. ఏప్రిల్ చివరి వారంలో, మే నెలలో మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఇప్పుడే బీర్ అమ్మకాలు టాప్ గేర్‌లో ఉంటే... వచ్చే వారాల్లో మరింత పీక్‌కు చేరే అవకాశం ఉందని మద్యం వ్యాపారులు అంచనా వేస్తున్నారు. డిమాండ్ తగ్గట్లు సప్లయ్ ఉంటుందా అనేది టెన్షన్ పడుతోంది.కానీ ప్రస్తుతమైతే డిమాండ్ తగ్గట్టుగా ఉత్పత్తి జోరు పెరిగింది. మేలోనూ ఎలాంటి షార్టేజ్ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు అధికారులు.మొత్తంగా ఎండలతో పోటీ పడి బీర్ సేల్స్ పెరుగుతున్నాయి.టెంపరేచర్స్ పెరిగే కొద్దీ సేల్స్... రికార్డ్ స్థాయిలో వుంటున్నాయి.డిమాండ్ తగ్గట్టు సప్లయ్ ఉండేలా చూడాలని బీర్ లవర్స్ కోరుతున్నారు.కృత్రిమ కొరత సృష్టించకుండా చూడాలంటున్నారు.హాట్‌హాట్ సమ్మర్ లో చిల్ అయ్యేలా కోరిన బ్రాండ్ దొరికేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# హెల్మెట్ ధరించడం ప్రాణ రక్షణకు కీలకం: మియాపురం శశికాంత్

**బీర్కూర్, ఏప్రిల్ 18(డిడి9 వార్త):**

రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు బీర్కూర్ కమప్ప చౌరస్తాలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మియపురం శశికాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సమన్వయంతో వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన శశికాంత్, నేటి కాలంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని, ఇది కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా వ్యక్తిగత భద్రతకు కూడా అత్యంత అవసరమని తెలిపారు. చిన్నపాటి నిర్లక్ష్యం ప్రాణాపాయానికి దారితీసే అవకాశముందని, హెల్మెట్ వాడకం ద్వారా ప్రమాదాల సమయంలో తల భాగానికి గాయాలు తగ్గించవచ్చని ఆయన వివరించారు. పోలీస్ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు వేగ పరిమితిని పాటించడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, మొబైల్ ఫోన్ వినియోగాన్ని నివారించాలని సూచించారు. ప్రజలు స్వచ్ఛందంగా భద్రతా నియమాలను పాటిస్తేనే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వారు పేర్కొన్నారు. హెల్మెట్ పంపిణీ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. వాహనదారులు ఈ చర్యను అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మేకల విఠల్, కొరిమి రఘు, పృథ్వీ గౌడ్, అశోక్, ప్రశాంత్, పోలీసులు మరియు పలువురు వాహనదారులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా
# కాంగ్రెస్‌పై బీజేపీ నిరసన

**బీర్కూర్, ఏప్రిల్ 18(డిడి9 వార్త):**



మహిళలను అన్ని రంగాల్లో ఉన్నత స్థాయిలో నిలపాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నారీశక్తి వందన్ ద్వారా 33% మహిళా రిజర్వేషన్‌కు కాంగ్రెస్ కూటమి పార్లమెంటులో వ్యతిరేకంగా ఓటు వేసిందని ఆరోపిస్తూ బీర్కూర్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగేల్ల సాయికిరణ్ మాట్లాడుతూ, 1996, 1998 సంవత్సరాల్లో మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్పేయి మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. అలాగే 2010లో కూడా ఈ బిల్లును కాంగ్రెస్ పార్టీ మూడుసార్లు వ్యతిరేకించిందని తెలిపారు.మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీ వివక్ష చూపుతోందని తీవ్రంగా ఖండిస్తూ, మహిళల అభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని విమర్శించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజల మద్దతు కోల్పోయే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెల యోగేశ్వర్, ఉపాధ్యక్షులు చేపూరి హనుమాన్లు, వడ్ల బసవరాజ్, సీనియర్ నాయకులు పోంచుగొండ, బీరుగొండ, మదారి శ్రీనివాస్, పండరి, సాయిబాబా, అలాగే కార్యకర్తలు బాబు గోండ, శ్రావణ్, అవారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారుల పోషణ, బ్రెయిన్ డెవలప్మెంట్ పై అవగాహన





**బీర్కూర్,ఏప్రిల్ 18(డిడి9 వార్త):**

బీర్కూర్ ఒకటవ అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణా పక్షం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సర్పంచ్ ధర్మతేజ, జిల్లా వెల్ఫేర్ అధికారి ప్రమీల, సీడీపీవో సౌభాగ్య, సూపర్వైజర్ సుమలత, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సంతోష్, చైల్డ్ ప్రొటెక్షన్ సోషల్ వర్కర్ స్రవంతి, వార్డు సభ్యురాలు మెంటే సౌందర్య మదు తదితరులు హాజరయ్యారు.అలాగే అంగన్వాడీ టీచర్లు, తల్లిదండ్రులు, పెద్దలు, చిన్నారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా 06 సంవత్సరాల పిల్లల పోషణ, మెదడు అభివృద్ధి, జంక్ ఫుడ్స్ వల్ల కలిగే నష్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు.పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం సరైన ఆహారం, శ్రద్ధ ఎంతో ముఖ్యమని అధికారులు వివరించారు.

# పోడు భూముల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, ఏప్రిల్ 18(డిడి9 వార్త):**





పోడు భూములు మరియు రైతు సంబంధిత సమస్యలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.తెలంగాణ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆధ్వర్యంలో 17042026న హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను శనివారం మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు, గిరిజన రైతు నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ రికార్డుల లోపాలు, సర్వే సమస్యలు, సరిహద్దు వివాదాల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపరచడం, అభివృద్ధి పనులకు ఆటంకాలు లేకుండా చూడడం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.అలాగే సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి రైతు సమస్యలకు సమగ్ర పరిష్కారం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓలు ఎన్‌వీ గిరి, ప్రభాకర్, డీటీవో, డీఆర్‌డీఏ, ఫారెస్ట్, ఎలక్ట్రిసిటీ, వ్యవసాయం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జనగణనలో ఎన్యూమరేటర్లదే కీలక పాత్ర : బోధన్ సబ్ కలెక్టర్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 18 (డీడీ9 వార్త) :**

దేశ భవిష్యత్తును నిర్దేశించే జనగణన ప్రక్రియలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, డేటా సేకరణలో ఏ చిన్న పొరపాటు జరిగినా సీరియస్‌గా పరిగణించాల్సి వస్తుందని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో తెలిపారు. శనివారం బోధన్‌లో నిర్వహించిన మొదటి దశ జనగణన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... క్షేత్రస్థాయిలో సేకరించే సమాచారం ఆధారంగానే ప్రభుత్వ పథకాలు, భవిష్యత్ విధానాల రూపకల్పన జరుగుతుందని గుర్తుచేశారు. ప్రతి ఎన్యూమరేటర్, సూపర్వైజర్ తమకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహించాలని, జనగణన పత్రంలోని 34 అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, సందేహాలుంటే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ప్రధానమని, ఫీల్డ్ సిబ్బంది ఎటువంటి గందరగోళానికి తావులేకుండా నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, ఎంఈఓలతో పాటు ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



# నిజామాబాద్ ప్రీమియర్ లీగ్2026 అట్టహాసంగా గ్రూపుల విభజన

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 18 (డీడీ9 వార్త) :**

క్రీడా మైదానంలో సరికొత్త ఉత్సాహాన్ని నింపేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్, నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా నిజామాబాద్ ప్రీమియర్ లీగ్ 2026'ను నిర్వహించేందుకు సన్నద్ధమయ్యాయి. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే 32 జట్ల కోసం నిర్వహించిన డ్రా ప్రక్రియను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తన కార్యాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం 32 జట్లను రెండు గ్రూపులుగా విభజించి, పారదర్శకంగా డ్రా నిర్వహించారు. గ్రూప్ ఏలో నందిపేట్, విక్కీ XI, శివాజీ చత్రపతి, అహ్మదేపూర్, స్కేల్పేట్ స్ట్రైకర్స్, రుద్రూర్, నవిపేట్, రూరల్, గరుడ బ్లాస్టర్స్, దుబాయ్ పెర్ఫ్యూమ్స్, సందీప్, వాల్వై 11 స్టార్స్, 7వ బెటాలియన్, మోర్తాడ్ 11, వర్ని వారియర్స్, మోహన్ 11 జట్లు పోటీ పడనున్నాయి. అదేవిధంగా గ్రూప్ బిలో ముప్కాల్, వేల్పూర్, కమ్మర్పల్లి పోలీస్ స్టేషన్, నిజామాబాద్ మ్యాన్ పవర్, టౌన్1 పోలీస్ స్టేషన్, కొండాపూర్, రైసింగ్ స్టార్స్, బి.సి.సి ఇందల్వాయి, కోటగిరి, మినార్ XI, మాక్లూర్, హ్యాపీనింగ్ XI, బోధన్, నరేష్ XI, గజానంద్ స్ట్రైకర్స్, గుండారం XI జట్లను కేటాయించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిజామాబాద్‌లోని ఉమెన్స్ కాలేజ్ గ్రౌండ్‌లో ఈ క్రీడా సంబరం జరగనుంది. ఈ డ్రా నిర్వహణ కార్యక్రమంలో డీసీపీ బస్వా రెడ్డి, జనరల్ సెక్రెటరీ కవితా రెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ రజనీకాంత్, ట్రెజరర్ సంతోష్‌తో పాటు పలువురు జాయింట్ సెక్రెటరీలు, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు క్రీడా ప్రతినిధులు పాల్గొన్నారు.




# నిజామాబాద్‌లో 55 బ్లాక్ స్పాట్లపై పోలీసుల నిఘా

- **ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 18 (డీడీ9 వార్త) :**

రోడ్డు ప్రమాదాలను నివారించి, ప్రాణనష్టాన్ని తగ్గించడమే లక్ష్యంగా నిజామాబాద్ పోలీస్ యంత్రాంగం సమరభేరి మోగించింది. జిల్లా వ్యాప్తంగా ప్రమాదకర ప్రాంతాలుగా గుర్తించిన 55 బ్లాక్ స్పాట్లను శనివారం పోలీస్ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో ఉన్న ఈ ప్రాంతాలను పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య స్వయంగా పర్యవేక్షించి, పరిస్థితులను సమీక్షించారు. ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జానకంపేట దర్గా వద్ద కమిషనర్ పర్యటించి, ప్రమాదాలకు దారితీస్తున్న పరిస్థితులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వాహనాల అధిక వేగం, రోడ్డు వంపులు, స్పష్టమైన సూచిక బోర్డుల లేమి, రాత్రి వేళల్లో తగినంత వెలుతురు లేకపోవడం వంటి అంశాలే ప్రమాదాలకు ప్రధాన కారణాలని గుర్తించారు. వీటిని సరిదిద్దేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బ్లాక్ స్పాట్లలో ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు, ఫ్లోరోసెంట్ పెయింటింగ్ మరియు రేడియం స్టిక్కర్లు ఉన్న పోలీస్ కటౌట్ 'లను ఏర్పాటు చేయాలని సూచించారు. వీటితో పాటు స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం, రోడ్డు మార్కింగ్‌లు, స్ట్రీట్ లైటింగ్‌ను మెరుగుపరచడం వంటి పనులు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ నిఘాను పెంచాలని అధికారులకు సూచించారు. ప్రమాదాల నివారణ అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు కూడా రోడ్డు భద్రతా నియమాలను విధిగా పాటించాలని కమిషనర్ కోరారు. ముఖ్యంగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వంటి జాగ్రత్తలు పాటించి, పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడమే ధ్యేయంగా పోలీసు యంత్రాంగం క్షేత్రస్థాయిలో పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) బసవరెడ్డి , ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.




# గిట్టుబాటు ధర కోసం ఐకేపీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 18 (డీడీ9 వార్త) :**

భీమ్‌గల్ మండల పరిధిలోని పిప్రి, బచంపల్లి, పురనిపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల మాజీ ఎంపీపీ కన్నె సురేందర్ మరియు ఆయా గ్రామాల సర్పంచులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నె సురేందర్ మరియు సర్పంచులు మాట్లాడుతూ..రైతులు కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వ మద్దతు ధర దక్కాలనే లక్ష్యంతో ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా, ఈ కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లు అమ్ముకుని గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రవేశ పెడుతున్న వివిధ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిప్రి సర్పంచ్ జనార్ధన్, బచంపల్లి సర్పంచ్ వన్నెల బాలమణి, పురనిపేట సర్పంచ్ బుర్ర సుమ దేవేందర్, ఆయా గ్రామాల ఉపసర్పంచులు జేమ్స్, హరికృష్ణ, ఐకేపీ సీసీలు కుంట శ్రీనివాస్, పురస్తు నరేష్ పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక నాయకులు జనార్ధన్, బచంపల్లి రాజేశ్వర్, ప్రవీణ్, వీడీసీ సభ్యులు రంజిత్, భూమన్న, శంకర్, మండల నాయకులు రాజు, లింబద్రి, జేజే నర్సయ్య, గోపాల్ నాయక్, సంగ్య, బంగ్లా దేవేందర్, ఐకేపీ అధ్యక్షురాలు, వీఓఏలు, రైతులు పాల్గొన్నారు.




# వెల్ఫేర్ వీక్ విజయవంతంగా నిర్వహించాలి: సీఎస్ రామకృష్ణ

**కామారెడ్డి, ఏప్రిల్ 18(డిడి9 వార్త):**

రాష్ట్రంలో ప్రజపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 20 నుంచి 26 వరకు నిర్వహించనున్న "వెల్ఫేర్ వీక్" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రామకృష్ణ సూచించారు. శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలోని అన్ని వెల్ఫేర్ విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.ఈ ఏడురోజుల ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా కిచెన్, శానిటేషన్ సదుపాయాల మెరుగుదల, హాస్టల్ విద్యార్థుల కోసం టాలెంట్ ఫెస్ట్ నిర్వహణ, అవసరమైన చిన్నపాటి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా హాస్టల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పేరెంట్స్‌టీచర్ సమావేశాలు నిర్వహించి విద్యార్థుల అభివృద్ధిపై చర్చించాల్సిందిగా తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాల పెంపు కోసం స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లు, సమ్మర్ క్యాంప్‌లు, క్రీడలు, గేమ్స్, ఆర్ట్ & క్రాఫ్ట్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే "బడి బాట" కార్యక్రమం ద్వారా విద్యాపట్ల ఆసక్తి పెంపొందించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వెల్ఫేర్ వీక్ సందర్భంగా విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సౌకర్యాల మెరుగుదల, శ్రేయస్సు లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు విక్టర్, మేడంమోహన్, ఆర్డీఓలు ఎన్‌వీ గిరి, ప్రభాకర్, వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.









## క్రీడా స్ఫూర్తితో నిజామాబాద్..ఘనంగా ప్రీమియర్ లీగ్ ర్యాలీ

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 18 (డీడీ9 వార్త) :**






యువత డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా ఉంటూ, క్రీడల వైపు అడుగులు వేయాలని.. అప్పుడే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య పిలుపునిచ్చారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్, నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నిజామాబాద్ ప్రీమియర్ లీగ్ అవగాహన ర్యాలీ నగరంలో సందడి నెలకొల్పింది. డీఎస్ఏ గ్రౌండ్ నుంచి పాలిటెక్నిక్ గ్రౌండ్ వరకు జరిగిన ఈ ర్యాలీని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించి క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపారు. నగరంలో క్రీడా సంస్కృతిని పెంచేందుకు, యువతను సన్మార్గంలో నడిపేందుకు చేపట్టిన ఈ ప్రీమియర్ లీగ్ సమ్మర్ క్యాంపు ఎంతో కీలకమని కమిషనర్ అన్నారు. జిల్లాకు క్రీడలపరంగా ఎంతో ఘన చరిత్ర ఉందని, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్ బాల్, యోగా వంటి క్రీడలలో రాణించే యువతకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని తెలిపారు. ఇదే సమయంలో ట్రాఫిక్ నిబంధనల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది జిల్లాలో 300 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, ప్రధానంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే ఈ దురదృష్టకర ఘటనలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తేనే గమ్యస్థానానికి క్షేమంగా చేరుకోగలమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం 'సే నో టు డ్రగ్స్.. సే ఎస్ టు స్పోర్ట్స్' అనే నినాదంతో యువతను చైతన్య పరిచారు. పాత కలెక్టరేట్ గ్రౌండ్, కోర్టు చౌరస్తా, మున్సిపల్ కార్యాలయం, ఎన్టీఆర్ చౌరస్తా, పోలీస్ కార్యాలయం, విజయ్ థియేటర్, రైల్వే కమాన్, అయ్యప్ప దేవాలయం మీదుగా సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ బస్వా రెడ్డి, నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ కవితా రెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ రజనీకాంత్, ట్రెజరర్ సంతోష్‌తో పాటు పలువురు జాయింట్ సెక్రెటరీలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మహిళా బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు: ఎమ్మెల్యే ధన్‌పాల్

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 18 (డీడీ9 వార్త) :**

మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఖరిపై బీజేపీ నాయకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్‌కు భవిష్యత్తులో మహిళలు తగిన గుణపాఠం చెబుతారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హెచ్చరించారు. శనివారం నగరంలోని నిఖిల్ సాయి చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. మహిళా బిల్లును వ్యతిరేకించడం అంటేనే మహిళలను అవమానించడమేనని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం ఇప్పుడు బయటపడిందని, 2023లో బిల్లును సమర్థించిన వారే ఇప్పుడు వ్యతిరేకించడం వెనుక ఉన్న రాజకీయ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మహిళా శక్తి అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్, అవకాశం వచ్చినప్పుడు వెనకడుగు వేయడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు ఇలాంటి వ్యతిరేక పనులకు పాల్పడుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. 60 ఏళ్లు అధికారంలో ఉన్నా చేయని పనిని, బీజేపీ ప్రభుత్వం మహిళల కోసం చేస్తున్నప్పుడు ప్రతిపక్షాలు అడ్డుకోవడం దారుణమని ఆయన పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతోనే బీజేపీ ఈ బిల్లును ముందుకు తెచ్చిందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్కర్ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు బొబ్బిలి సువర్ణ వేణు, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్ యాదవ్, మల్కాయి మహేందర్, జ్యోతి మురళి, మహిళా నాయకురాలు వనిత తదితరులు పాల్గొన్నారు.






## ప్యారడైజ్‌లో ఆర్నోరా సిల్వర్ షోరూమ్ ప్రారంభం

- **సందడి చేసిన సినీనటి నిధి అగర్వాల్**

**సికింద్రాబాద్, ఏప్రిల్ 18 ( డీడీ9 వార్త):**



ప్రముఖ వెండి ఆభరణాల బ్రాండ్ 'ఆర్నోరా' సిల్వర్ జువెలర్స్ నూతన షోరూమ్‌ను సికింద్రాబాద్ ఎస్డీ రోడ్డులోని ప్యారడైజ్ సర్కిల్ వద్ద శనివారం సినీనటి నిధి అగర్వాల్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్‌లో ఏర్పాటు చేసిన అధునాతన వెండి ఆభరణాలను ఆమె ఆసక్తిగా తిలకించారు. అనంతరం నిధి అగర్వాల్ మాట్లాడుతూ... ఆధునిక అభిరుచులకు అనుగుణంగా మగువ మనసు దోచేలా ఇక్కడ అద్భుతమైన డిజైన్లు అందుబాటులో ఉన్నాయని కొనియాడారు. వెండితో చేసిన ఆభరణాలు ఇంతింత అందంగా ఉంటాయా అనిపించేలా అత్యంత కళాత్మకంగా ఉన్నాయని, ఇవి యువతను విశేషంగా ఆకట్టుకుంటాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. నిధిని చూసేందుకు షోరూమ్ వద్ద అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆర్నోరా వ్యవస్థాపకులు సాహిల్ గుప్తా మాట్లాడుతూ,...స్వచ్ఛమైన వెండితో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆభరణాలను రూపొందించడమే తమ బ్రాండ్ ప్రత్యేకత అని తెలిపారు. నిత్యం ధరించే ఆభరణాలతో పాటు ప్రత్యేక వేడుకల కోసం స్టైలిష్ డిజైన్లను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నూతన ప్రారంభోత్సవం సందర్భంగా వినియోగదారులకు ఆభరణాల కొనుగోలుపై 25 శాతం ప్రత్యేక తగ్గింపును అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# జోగిపేట్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం.

- **జోగిపేట్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం.**
- **38 ద్విచక్ర వాహనాల తనిఖీ, 10 ద్విచక్ర వాహనాల స్వాధీనం.**
- **రూ లక్ష విలువైన కలప స్వాధీనం, ఐదు కేసులు నమోదు.**
- **అసాంఘిక కార్యకలాపాలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవు.**
- **వాహనదారులు హెల్మెట్ ధరించాలి.**
- **ప్రజల సంరక్షణ, భద్రతకై కమ్యూనిటీ కాంటాక్ట్ ల నిర్వహణ**
- **70 మంది సిబ్బందితో ఉదయం 5 గంటల నుండి తనిఖీలు.**
- **స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్.**







ప్రజల రక్షణ, సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ అండ్ సెర్చ్) లను నిర్వహించడం జరుగుతుందని స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్ తెలిపారు. ఇచ్చోడ మండలంలోని జోగిపేట గ్రామంలో ఉదయం ఐదు గంటల నుండి 70 మంది సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 38 ద్విచక్ర వాహనాలు తనిఖీ చేయగా, సరైన ధ్రువపత్రాలు లేనటువంటి 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్నటువంటి 15వేల రూపాయల చలాన్లను ప్రజలు చెల్లించడం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రజలతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా "అరైవ్ అలైవ్" లో భాగంగా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రాణనష్టాన్ని తగ్గించాలని సూచించారు. ప్రజలు యువత వాహనాలలో ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. అదేవిధంగా గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. అక్రమంగా కలప నిలువ ఉంచిన ఐదుగురిపై కేసు నమోదు చేయడం జరిగిందని దాదాపు లక్ష రూపాయల విలువైన కలప స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేస్తూ వాటి ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సోషల్ మీడియా పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడా ఎస్ హెచ్ ఓ బండారి రాజు, ఇచ్చోడా రూరల్ సీఐ సిహెచ్ రమేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు ఇమ్రాన్, శ్రీకాంత్, పూజ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం : నిజామాబాద్ సీపీ పి.సాయి చైతన్య

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 18 (డీడీ9 వార్త) :**

రోడ్డు ప్రమాదాలు మనిషిని నిలువునా కోలుకోలేని దెబ్బతీస్తాయి. ఇతర వ్యాధులు, విపత్తుల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా చేపట్టిన అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం ఎడపల్లి మండలంలోని మంగళ్‌పహాడ్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... జిల్లాలో గత 2025 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల కారణంగా 302 మంది మరణించారని, ఇది కోవిడ్ సమయంలో జిల్లాలో నమోదైన మరణాల కంటే ఎక్కువని ఆయన గణాంకాలను వివరించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం వంటి నిర్లక్ష్యపు చర్యలే ప్రాణాల మీదకు తెస్తున్నాయని ఆయన హెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యం కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగుల్చుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని కోరారు. డ్రైవర్లు, వాహనదారులు డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్ లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే వారికి ప్రభుత్వం సహావత్ పథకం కింద రూ.25 వేల ప్రోత్సాహకాన్ని అందిస్తుందని కమిషనర్ తెలిపారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తూ రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను ఆయన విడుదల చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారిస్తామని అక్కడి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయబాబు, ఎస్ఐలు రమ, మచ్చేందర్ రెడ్డి, చంద్రమోహన్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.









# ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

- **రోడ్డుపైకి చేరిన చిరువ్యాపారుల బతుకులు**

**సికింద్రాబాద్, ఏప్రిల్ 18 ( డీడీ9 వార్త ):**





హైకోర్టు ఆదేశాల మేరకు సికింద్రాబాద్ పరిధిలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు ప్రక్రియ శనివారం వేగవంతమైంది. జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోన్ సిటీ ప్లానర్ సత్యభామ, కవాడిగూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పుష్పలత ఆధ్వర్యంలో అధికారులు భారీ బందోబస్తు మధ్య ఈ డ్రైవ్ నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి నుంచి ముషీరాబాద్ చౌరస్తా మీదుగా పద్మారావు నగర్ పార్క్ వరకు రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన దుకాణాలు, షెడ్లను జేసీబీల సాయంతో కూల్చివేశారు. బాటసారులకు ఇబ్బంది కలగకుండా ఫుట్‌పాత్‌లను పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ముందే సూచించినా స్పందించని వారిపై కఠినంగా వ్యవహరించినట్లు సిటీ ప్లానర్ సత్యభామ ఈ సందర్భంగా తెలిపారు.మరోవైపు జీహెచ్ఎంసీ అధికారుల చర్యలపై చిరువ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇదే ప్రాంతంలో చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని, ఇప్పుడు ముందస్తు సమాచారం లేకుండా తమ పొట్ట కొట్టడం ధర్మం కాదని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రత్యామ్నాయం చూపకుండా ఇలా అర్ధాంతరంగా దుకాణాలను కూల్చివేస్తే తమ జీవనం ఎలా సాగుతుందని, అప్పులు తెచ్చి పెట్టుకున్న సరుకంతా పాడైపోయిందని వారు వాపోయారు. ప్రభుత్వమే తమను ఆదుకుని వ్యాపారాలు చేసుకునేందుకు వేరే చోట అవకాశం కల్పించాలని బాధిత వ్యాపారులు డిమాండ్ చేశారు. ఈ తొలగింపుల సమయంలో కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకున్నప్పటికీ, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని సర్దుబాటు చేశారు.



## 'మైసా' కోసం రోజుకు 8గంటల కఠిన శిక్షణ..

నేషనల్ క్రష్ రష్మిక మందన్న, రౌడీ హీరో విజయ్ దేవరకొండల వివాహ వేడుక ముగిసిందో లేదో, అప్పుడే ఈ స్టార్ కపుల్ తమ వర్క్‌లో మునిగిపోయారు. పెళ్లి తర్వాత హీరోయిన్ల కెరీర్ స్లో అవుతుందనే అంచనాలను రష్మిక పటాపంచలు చేస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న భారీ లేడీ ఓరియెంటెడ్ మూవీ 'మైసా' కోసం రష్మిక ఏకంగా బీస్ట్ మోడ్ ఆన్ చేసింది. విరామం లేకుండా తనను తాను శారీరకంగా, మానసిక సిద్ధం చేసుకుంటూ వెండితెరపై ఒక అద్భుత పోరాటాన్ని చూపించడానికి సిద్ధమవుతోంది. ఈ సినిమాలో రష్మిక ఒక ధైర్యవంతురాలైన గోండు మహిళగా కనిపిస్తోంది. గిరిజన ప్రాంత నేపథ్యం కావడంతో, యుద్ధ సన్నివేశాలు చాలా సహజంగా, పవర్‌ఫుల్‌గా ఉండాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. ఇందుకోసం రష్మిక ప్రస్తుతం బ్యాంకాక్‌లో మకాం వేసింది. రోజుకు ఏకంగా 8 గంటల పాటు అంతర్జాతీయ స్థాయి స్టంట్ మాస్టర్ల నేతృత్వంలో మార్షల్ ఆర్ట్స్, స్టంట్ టెక్నిక్స్‌లో శిక్షణ పొందుతోందని సమాచారం.

అండి లాంగ్, జైకా స్టంట్ టీమ్ ఆమెకు శిక్షణ ఇస్తుండటంతో, సినిమాలో యాక్షన్ ఎపిసోడ్స్ నెక్స్ట్ లెవల్‌లో ఉండబోతున్నాయని అర్థమవుతోంది. తాజాగా, రష్మిక ట్రైనింగ్ సెషన్స్‌కు సంబంధించిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఈ ఫోటోల్లో ఒక ఆసక్తికరమైన విషయం అందరినీ ఆకట్టుకుంటోంది. ఒకవైపు సంసార జీవితాన్ని, మరోవైపు కెరీర్‌ను బ్యాలెన్స్ చేస్తున్న రష్మికను చూసి అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## రామ్ నెక్స్ట్ మూవీ ఆలస్యానికి కారణం ఇదేనా?..

టాలీవుడ్ యువ నటుడు రామ్ పోతినేని కొంతకాలం క్రితం ఆంధ్ర కింగ్ తాలూకా అనే చిత్రంతో ప్రేక్షకులను పలకరించాడు. మంచి అంచనాల నడుమ విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ లభించినప్పటికీ, బాక్స్ ఆఫీస్ వద్ద మాత్రం ఆశించిన స్థాయిలో భారీ విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ సినిమా విడుదలైన కొద్ది రోజులకే రామ్ తన కొత్త సినిమాను ప్రారంభించనున్నట్లు పెద్ద ఎత్తున వార్తలు వినిపించాయి. అనంతరం, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ శిష్యుడు అయిన విఘ్నేష్ దర్శకత్వంలో రామ్ ఓ సినిమా చేయనున్నట్లు కూడా వార్తలు వచ్చాయి. దీంతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా ఖరారైందనే ప్రచారం టాలీవుడ్ వర్గాల్లో జోరుగా సాగింది.

ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, రామ్ తన కోసం ఇప్పటికే ఒక కథను సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ కథ విషయంలో రామ్, విఘ్నేష్ మధ్య పలు చర్చలు కూడా జరిగినట్లు సమాచారం. అయితే కొన్ని కారణాల వల్ల విఘ్నేష్ ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ కథను ఓన్ చేసుకొని దానిని వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించే సరైన దర్శకుడి కోసం రామ్ ప్రస్తుతం వెతుకులాట కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రామ్ తదుపరి సినిమా ప్రారంభం కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయని టాలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి.



## బిగ్‌బాస్ నిర్వాహకులకు షాకిచ్చిన నటి.. రెండు కోట్ల నష్టపరిహారం ఇవ్వాల్సిందేనంటూ డిమాండ్

ప్రముఖ రియాలిటీ షో బిగ్‌బాస్ చుట్టూ వివాదాలు కొత్తేమీ కావు. కానీ, తాజాగా ఒక నటి బిగ్‌బాస్ నిర్వాహకులపై చేసిన ఆరోపణలు ఇప్పుడు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. తన ఆరోగ్యాన్ని పాడు చేసినందుకు గాను ఏకంగా రూ. 2 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేయడం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ నటి మరెవరో కాదు.. ప్రముఖ మోడల్, నటి సోనాల్ రౌత్. హిందీ బిగ్‌బాస్ సీజన్ 8లో కంటెస్టెంట్‌గా పాల్గొని ఫైనల్ వరకు వెళ్లిన సోనాల్ రౌత్‌కు మంచి గుర్తింపు ఉంది. అయితే, ఇటీవల ఆమె బిగ్‌బాస్ మరాఠీ సీజన్ 6లో పాల్గొంది. అందరూ ఆమె ఈ షోలో చాలా కాలం ఉంటుందని భావించారు. కానీ కేవలం రెండు వారాలకే ఆమె బయటకు వచ్చేసింది. ఈక్రమంలోనే.. సోనాల్ తన సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ చూసి జనాలు షాక్ అవుతున్నారు. తన ఒంటిపై వచ్చిన దద్దుర్లు, మచ్చల ఫోటోలను షేర్ చేస్తూ.. హౌస్‌లోని దారుణమైన పరిస్థితులను బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. "రియాలిటీ షో అంటే ప్రాణాలను పణంగా పెట్టడం కాదు. నిర్వాహకులపై నమ్మకంతోనే మేము హౌస్‌లోకి వెళ్తాము.

కానీ అక్కడ వాతావరణం చాలా అపరిశుభ్రంగా ఉంది. వంటగదిలో ఎలుకలు, బొద్దింకలు స్వైర విహారం చేస్తున్నాయి. మిగిలిపోయిన ఆహారాన్ని బయట పడేయడం వల్ల ఈ సమస్య మరీ ఎక్కువైంది. హౌస్‌లో టవల్స్, బెడ్ షీట్ల కొరత ఉండటంతో కంటెస్టెంట్స్ ఒకరు వాడిన వస్తువులను మరొకరు వాడాల్సి వచ్చింది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. అంతేకాకుండా, పనిష్మెంట్ పేరుతో 17 మంది కంటెస్టెంట్లను కేవలం ఒకే వాష్‌రూమ్‌ను ఉపయోగించమని కోరడం వల్ల తనకు తామర వంటి చర్మ వ్యాధి సోకిందని సోనాల్ పేర్కొంది. "సిగరెట్లు తాగి అక్కడే పడేయడం, అపరిశుభ్రమైన వాతావరణం వల్ల నా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. షో నుంచి బయటకు వచ్చి మూడు నెలలైనా ఇప్పటికీ ఆ చర్మ వ్యాధి నన్ను పీడిస్తోంది. ఆ సమయంలో నేను అనుభవించిన శారీరక, మానసిక క్షోభకు వెలకట్టలేము. అందుకే నాకు జరిగిన నష్టానికి 2 కోట్లు పరిహారం కావాలి" అని ఆమె డిమాండ్ చేస్తోంది. ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. బిగ్‌బాస్ వంటి పెద్ద షోలలో కనీస జాగ్రత్తలు తీసుకోరా? అని నెటిజన్లు నిర్వాహకులను ప్రశ్నిస్తున్నారు.



## మహేష్, రవితేజ అలా పిలుస్తారు.. 'రంగస్థలం' హిట్‌తో ఊర్లో ఆ పని చేశాను

ప్రస్తుతం తెలుగు సినిమా పరిశ్రమలో అద్భుతమైన జోష్‌తో కెరీర్‌ను ముందుకు సాగిస్తున్న క్యారెక్టర్ ఆర్టిస్టుల్లో అజయ్ ఘోష్ ఒకరు. ఈయన శర్వానంద్ హీరోగా రూపొందిన ప్రస్థానం సినిమాతో వెండితెరకు పరిచయం అయ్యారు. ఆ తర్వాత చాలా సంవత్సరాల పాటు ఈయన కెరీర్ పెద్దగా ఊపందుకోలేదు. అడపాదడపా సినిమాల్లో నటిస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించారు. అలాంటి సమయంలో రామ్ చరణ్ హీరోగా, సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన రంగస్థలం చిత్రంలో ముఖ్య పాత్రలో నటించే అవకాశం లభించింది.

ఈ సినిమా బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించడం, ఇందులో ఆయన పోషించిన పాత్రకు ప్రశంసలు లభించడం వల్ల ఒక్కసారిగా అజయ్ ఘోష్‌కు భారీ గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత నుంచి వరుసగా సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంటూ బిజీ క్యారెక్టర్ ఆర్టిస్టుగా కొనసాగుతున్నారు. ఇటీవల తిరువీర్ ప్రధాన పాత్రలో రూపొందిన పాపం ప్రతాప్ చిత్రంలో కూడా అజయ్ ఘోష్ కీలక పాత్రలో నటించారు. తాజాగా విడుదలైన ఈ సినిమాకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సందర్భంగా అజయ్ ఘోష్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొని టాలీవుడ్ స్టార్ హీరోలు తనతో ఎలా మెలుగుతారనే విషయంతో పాటు మరికొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించారు. అజయ్ ఘోష్ మాట్లాడుతూ... రవితేజ గారితో ఇప్పటివరకు చాలా సినిమాలు చేశాను. ఆయన నాతో చాలా సరదాగా ఉంటారు. ఎప్పుడూ నన్ను 'బాబాయి' అని పిలుస్తూ ఉంటారు. ఇక మహేష్ బాబు గారు కూడా నన్ను 'బాబాయి' అని పిలుస్తారు. అల్లు అర్జున్ 'ఘోష్ గారు' అని, రామ్ చరణ్ 'అజయ్ ఘోష్ గారు' అని పిలుస్తారు" అని తెలిపారు. అలాగే రంగస్థలం సినిమా తన కెరీర్‌కు మంచి గుర్తింపు తీసుకువచ్చిందని, ఆ సినిమా విజయంతో వచ్చిన ఆదాయంతో



తన సొంత ఊరిలో ఒక ఇల్లు నిర్మించుకున్నానని అజయ్ ఘోష్ వెల్లడించారు.

## అదంత నెగెటివ్ అవుతుందనుకోలేదు

ఒకప్పుడు హీరోయిన్‌గా మెరిసిన రాశి (Raasi) ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సందడి చేస్తున్నారు. ఆమె కీలక పాత్ర పోషించిన కొత్త సినిమా 'పాపం ప్రతాప్' (Papam Prathap). ఈ మూవీ సక్సెస్ మీట్‌లో అడిగిన ప్రశ్నలకు రాశి సమాధానాలిచ్చారు. 'నిజం (Nijam Movie) సినిమాలో మీరు నెగెటివ్ క్యారెక్టర్‌లో నటించారు. తర్వాత హీరోయిన్‌గా అవకాశాలు రాలేదు' అని ప్రస్తావించగా.. అది నెగెటివ్ అవుతుందని అనుకోలేదన్నారు.

''ఏ సినిమాలో ఎలాంటి పాత్ర కావాలన్నది నేను నిర్ణయించను. 'మిమ్మల్ని అనుకొనే ఈ సినిమాలోని పాత్ర రాశాను' అని పాపం ప్రతాప్ దర్శకుడు చెప్పారు. ఇలా ఎవరు చెప్పినా.. ఆయా పాత్రలు నచ్చితేనే నటిస్తా. అది పాజిటివ్ క్యారెక్టరా? నెగెటివ్ రోలా? అనేది పట్టించుకోను. ఏదైనా ఒకటే. ఓ నటిగా అన్నిరకాల షేడ్స్ ఉన్న రోల్స్ ప్లే చేయాలి. ఆ ఉద్దేశంతోనే 'నిజం'లో నటించా. కానీ, ఆ పాత్ర అంతగా నెగెటివ్ అవుతుందని అనుకోలేదు. ఇకపై ఏ రోల్ అయినా ప్రేక్షకులు అంగీకరించేవిధంగా ఉంటేనే చేస్తాను'' అని తెలిపారు.

మహేశ్‌బాబు హీరోగా దర్శకుడు తేజ తెరకెక్కించిన చిత్రం 'నిజం'. ఇందులో గోపీచంద్ విలన్‌గా నటించారు. రాశి కూడా నెగెటివ్ ఛాయ ఉన్న పాత్రలో కనిపించి, ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. కథానాయికగా రాణిస్తున్న సమయంలో ఇలాంటి రోల్ చేయడం ఆమె కెరీర్‌పై ప్రభావం చూపింది. 2003లో ఈ మూవీ రిలీజ్ అయింది. 'పాపం ప్రతాప్' విషయానికొస్తే.. తిరువీర్ హీరోగా ఎస్పీ దుర్గా నరేశ్ రూపొందించారు. శుక్రవారం (ఏప్రిల్ 17) విడుదలైన ఈ సినిమా ప్రేక్షకాదరణ పొందింది.



## ప్రత్యేక సెట్‌లో పాట!

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'వారణాసి'. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా గత కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో చిత్రీకరణ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇక్కడే ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో పాట చిత్రీకరణ చేస్తున్నట్లు సమాచారం. దీనికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిస్ నృత్యరీతులు అందిస్తున్నట్లు తెలిసింది. ఈ పాట చిత్రీకరణ పూర్తయ్యాక చిత్ర బృందం మే నెలంతా విరామం తీసుకోనుందని.. జూన్‌లో షూట్ తిరిగి ప్రారంభించనున్నారని తెలుస్తోంది. వివిధ యుగాలతో ముడిపడి సాగే ఆసక్తికర కథతో ఈ సినిమా ముస్తాబవుతుండగా.. మహేశ్ దీంట్లో శ్రీరాముడిగా, రుద్రగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి సంగీతం: ఎంఎం కీరవాణి, కథ: కె విజయేంద్ర ప్రసాద్, ఎస్ఎస్ కంచి, మాటలు: దేవ కట్టా, ఛాయాగ్రహణం: పీఎస్ వినోద్.



## ఆయనలో డ్యాన్స్ ఏ కాదు.. తెలియని ఎనర్జీ కూడా ఉంటుంది.

తెలుగు ప్రేక్షకులకు 'ఉయ్యాలా జంపాల' సినిమాతో పరిచయమైన అవికా గోర్, అతి తక్కువ కాలంలోనే తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడే తన వ్యక్తిగత జీవితంలో కీలక నిర్ణయం తీసుకున్న అవికా, ప్రస్తుతం విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పట్ల తనకున్న అభిమానాన్ని ఆమె బయటపెట్టింది. బన్నీ స్టైల్, ఆయన ఎనర్జీ అంటే తనకు ఎంతో ఇష్టమని మనసులో మాట బయటపెట్టింది. "అల్లు అర్జున్ గారు తనను తాను తీర్చిదిద్దుకునే విధానం నాకు చాలా స్ఫూర్తినిస్తుంది. ముఖ్యంగా ఆయన డాన్స్ చేసే తీరు అద్భుతం. ఆ గ్రేస్ మరెవరికీ రాదు" అని ప్రశంసలు కురిపించింది. కేవలం సినిమాల్లోనే కాకుండా, నిజ జీవితంలో కూడా అల్లు అర్జున్ ప్రవర్తించే తీరు తనను ఆకట్టుకుంటుందని అవికా తెలిపింది. "ఆయనలో ఒక తెలియని ఎనర్జీ ఉంటుంది. అది కేవలం వెండితెరపైనే కాదు, బయట కలిసినప్పుడు కూడా ఆయన నుంచి వచ్చే ఆ పాజిటివ్ వైబ్ నాకు చాలా ఇష్టం. సెల్ఫ్ మేడ్ స్టార్‌గా ఆయన ఎదిగిన తీరు ప్రతి ఒక్కరికీ ఆదర్శం" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం అవికా చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి, ముఖ్యంగా అల్లు అర్జున్ అభిమానులు ఈ వ్యాఖ్యలను షేర్ చేస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## ఆ టైమ్‌లో మద్యానికి బానిసయ్యాను..

బాలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలలో అద్భుతమైన జోష్‌తో కెరీర్‌ను ముందుకు సాగిస్తున్న యువ నటీమణుల్లో జాన్వీ కపూర్ ఒకరు. తాజాగా ఈమె ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన జీవితంలో ఎదురైన డార్క్ షేడ్ గురించి ఆమె ఓపెన్‌గా మాట్లాడారు. తాజాగా జాన్వి కపూర్ మాట్లాడుతూ, "మద్యానికి బానిసైన వారిని నేరస్తుల్లా చూడకండి. వారు కూడా అందరిలాంటి సాధారణ మనుషులే. మద్యానికి బానిస కావడం అనేది ఒక మానసిక ఆరోగ్య సమస్య మాత్రమే. కొంతమంది తీవ్రమైన ఒత్తిడి, మానసిక సమస్యల కారణంగా మద్యానికి అలవాటు పడతారు. ఆ తర్వాత అది పెరిగి వారికి బానిసత్వంగా మారుతుంది. అలాంటి వారిని దూరం పెడితే వారు ఆ అలవాటుకు మరింత దగ్గరవుతారు. అదే ప్రేమతో దగ్గరకు తీసుకుంటే వారు ఆ చెడు అలవాటుకు దూరమయ్యే అవకాశం ఉంటుంది" అని తెలిపారు. అలాగే, "నా జీవితంలో కూడా ఒకానొక సమయంలో మద్యం విలన్‌గా మారింది. మొదట సరదా కోసం మద్యం తాగడం ప్రారంభించాను. తర్వాత నేను దానికి బానిసనయ్యాను.

